క్లుప్తంగా

రాంప్రసాద్‌కు డాక్టరేట్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ తెలుగు విభాగం పరిశోధక విద్యార్థి నలసాని రాం ప్రసాద్‌కు డాక్టరేట్‌ను సోమవారం ప్రకటించారు. 'ఆచార్య పింగళి లక్ష్మీకాంతం జీవితం, రచనల పరిశీలన' అనే అంశంపై తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సుమారు ఆరేళ్ల పాటు పరిశోధన చేశారు. ఈ మేరకు హెచ్‌సీయూ డాక్టరేట్ డిగ్రీని ప్రకటించారు. రాంప్రసాద్‌ను ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు, పిల్లలమర్రి రాములు, గోనానాయక్ ,పమ్మి పవన్‌కుమార్, విజయలక్ష్మీ, డాక్టర్ భూక్యా తిరుపతి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, డాక్టర్ విజయకుమారి అభినందించారు.

ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం తెల్లవారుజామున గోకుల్ ప్లాట్స్‌లో జరుగుతున్న నూతన సీసీ రోడ్డు పనులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.40 లక్షల వ్యయంతో పనులు చేపట్టారని ,పనుల్లో నాణ్యతను పరిశీలించామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు బ్రిక్ శ్రీను, గుమ్మడి శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్, కృష్ణ, కాలనీవాసులు ఉన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల్లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి తెలిపారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీ, మైత్రీ లేక్ వ్యూ కాలనీలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్‌రావుతో కలిసి పర్యటించారు. నీటి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. వేసవిలో నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

పటాన్‌చెరు టౌన్: డాక్టర్ ప్రీతి కేసులో బాధ్యులను కఠినంగా శిక్షించాలని టీబీఈఎస్‌ఎస్ (తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు పీపీ రాథోడ్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్రీతి మృతికి రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని తహసీల్దార్ పరమేశంకు వినతిపత్రం అందజేశారు.



ప్రదర్శనలో వివిధరకాల వస్తువులు

దస్తకారి హాత్ క్రాఫ్ట్ బజార్

- నగరంలో మొదటిసారిగా 'నిథమ్'లో నిర్వహణ
- ఉచిత ప్రవేశం
- ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటలవరకు
- నేటితో ఆఖరు



రాయదుర్గం: హైదరాబాద్ నగరంలో మొదటిసారిగా 'దస్తకారి హాత్ క్రాఫ్ట్ బజార్' అందుబాటులోకి వచ్చింది. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో ఇటీవల ప్రారంభించారు. ఇందులో 18 రాష్ట్రాలకు చెందిన 100 మంది చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులను 80 స్టాల్స్‌లో ఉంచారు. కాగా 1994లో దస్తకారి హాత్ సమితి వ్యవస్థాపకులు, అధ్యక్షులు జయాజైట్లీ ఆధ్వర్యంలో ఏర్పాటైంది. ఇప్పటి వరకు 75వేల మంది ఈ బజార్లలో తమ ఉత్పత్తులను విక్రయించారు. రెండు మిలియన్ల వినియోగదారులు ఇందులో వస్తువులను కొనుగోలు చేయడం విశేషం. ప్రధానంగా ఎంబ్రాయిడరీ, బ్లాక్ ప్రింటింగ్, బంధానీ బాతిక్, అప్లిక్, జాందానీ, బనారసీ చీరలు, లెదర్‌బ్యాగులు, ల్యాంప్స్, మ్యాట్స్, బాస్కెట్రీ, స్టేషనరీ, టాయ్స్ , గేమ్స్, జువెలరీ, పాటరీ వంటి వాటిని ప్రదర్శనలో ఉంచారు. సందర్శకుల కోసం ప్రత్యేకంగా ఫోక్ ఆర్ట్స్‌లో గోండ్, కాళిఘాట్, మధుబని, పిచ్వాయ్, వర్లి, మైనాచుర్, పట్టచిత్రలు ప్రదర్శనలో ఉన్నాయి. కాగా సందర్శకుల కోసం ఢిల్లీకి చెందిన చాట్ కచోరి, టీని అందిస్తారు. ప్రత్యేకంగా కల్బేలియా డ్యాన్స్, రాజస్థానీ కళాకారుల ప్రదర్శనలు తిలకించవచ్చు.



పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



చెరువు పరిసరాలలోని ప్లాస్టిక్ కవర్లను సేకరిస్తున్న లలిత సోమిరెడ్డి, విద్యార్థులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరముందని తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్లెపల్లి లలితా సోమిరెడ్డి అన్నారు. సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కొల్లూరు పెద్ద చెరువు పరిసరాలను విద్యార్థులతో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. చిన్ననాటి నుంచి విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్లాస్టిక్ వాడడం వల్ల జరిగే నష్టాలు, వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు చెట్లను కాపాడడంతోపాటు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మయూరి, రాంసింగ్, శంషాబాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలాకు సహకరించండి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు):లింగంపల్లి చౌరస్తాలో నూతనంగా నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ కారణంగా ఆటోడ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని, వారికి బీహెచ్‌ఈఎల్ యాజమాన్యం సహకరించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. సోమవారం బీహెచ్‌ఈఎల్ టౌన్ షిప్ సివిల్ మేనేజర్ ఆమ్లాన్ దత్తకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భెల్ టౌన్‌షిప్‌లో ఆటోలు పార్కు చేసుకునే విధంగా యాజమాన్యం సహకరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు వెంకటేష్ గౌడ్, బూరగడ్డ నగేష్, శ్రీనివాస్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.



బీహెచ్‌ఈఎల్ సివిల్ మేనేజర్ ఆమ్లాన్ దత్తకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అక్రమ వాటర్‌ప్లాంట్‌లు తొలగించాలని వినతి



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్‌లను తొలగించాలంటు బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున బస్తీ వాసులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. రానున్న తరాలకు జల వనరుల కొరతకు కారణమయ్యే వాటర్ ప్లాంట్‌లను వెంటనే తొలగించాలని అధికారులకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంత్ రెడ్డి, నాయకులు గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, దొడ్ల రాంరెడ్డి, కనకారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో శ్రీ మల్లికార్జున స్వామి భ్రమరాంబిక కల్యాణం, గొల్ల కేతమ్మ ఆలయం 18వ వార్షికోత్సవంను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ నాయకులు సంజీవరెడ్డి, మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీఆర్‌యస్ పార్టీ నాయకులు కాశీనాద్‌యాదవ్, ఎండి ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

'అక్షయపాత్ర'కు వాహనాలు అందజేత



ఫుడ్ డెలివరీ వాహనాలను అందజేస్తున్న ఎం.ఎస్.ఎన్ గ్రూప్ కంపెనీల చైర్మన్ డా.ఎం.ఎస్.రెడ్డి

గచ్చిబౌలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న అక్షయ పాత్రకు ఎం.ఎస్.ఎన్ గ్రూప్ కంపెనీల చైర్మన్ డాక్టర్ ఎం.ఎస్.రెడ్డి సోమవారం కొండాపూర్‌లోని వైట్ ఫీల్డ్‌లో రెండు ఫుడ్ డెలివరీ వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.ఎన్.రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్‌ఆర్)లో భాగంగా అందజేశామని చెప్పారు. పేద విద్యార్థులకు వేడివేడి భోజనం సకాలంలో అందించేందుకు అక్షయ పాత్రతో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ఎన్.గ్రూప్ డైరెక్టర్లు సింధుజారెడ్డి, నిఖిల్ తేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



సింగారయ్యకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్‌లో నివాసముండే సింగారయ్యకు అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.2.50 లక్షల చెక్కును సోమవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

విదేశీ విద్యపై అవగాహన సదస్సు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని వారధి ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ వారి ఆధ్వర్యంలో సోమవారం విదేశీ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ కెన్నెసా స్టేట్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డా.లీలి, డాక్టర్ బెంజిమెన్ క్లైన్ పాల్గొని విద్యార్థులకు వచ్చే ఉపకార వేతనాలు, అసిస్టెంట్ షిప్ అవకాశాల గురించి వివరించారు. విదేశీ విద్య అధిక ఖర్చుతో కూడుకున్నది కాదని ప్రతి పేదవాడికి వారధి ఓవర్సీస్ అవకాశాలను ఇస్తుందని వివరించారు. వీసా ఇంటర్వ్యూ సులభతరం చేసేందుకు ఈ బుక్‌ని ప్రతి విద్యార్థికి అందిస్తున్నామని నిర్వాహకులు ఐనోలు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో వారధి మేనేజర్ కృష్ణపోట్ల విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

రాయదుర్గం: రాయదుర్గం ఎంఎస్ కన్వెన్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం సోమవారం ఆత్మీయ పలకరింపులతో సాగింది. రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సమావేశాన్ని పూర్వవిద్యార్థులు ఎస్ సుభాషిణి, అనిత, లక్ష్మణ్, మల్లేష్‌ల పర్యవేక్షణలో సాగింది. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు

మియాపూర్: అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చందానగర్‌లోని అంబేడ్కర్ కల్యాణ మండపంలో సోమవారం సర్కిల్ పరిధిలోని వ్యాపార, వాణిజ్య, భవనాల యజమానులకు సమావేశాన్ని నిర్వహించారు. జోనల్ జాయింట్ కమిషనర్ మల్లారెడ్డి, శేరిలింగంపల్లి–20 ఉప కమిషనర్ వెంకన్న, చందానగర్ సర్కిల్ –21 సుదామ్షలు హాజరై మాట్లాడుతూ.. 15రోజుల్లోగా నిబంధనలు పాటించాలని యజమానులకు సూచించారు. తదుపరి సంబంధిత శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, ఒక వేళ పాటించకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు మెహ్రా, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సంపత్, మియాపూర్ సీఐ తిరుపతిరావు, డాక్టర్ కార్తీక్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

మియాపూర్: ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మియాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లాపూర్‌లోని సింగోటం గ్రామానికి చెందిన ఎల్లాస్వామి, జయసుధ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. మూడో కుమార్తె హేమలతను (24)వారి గ్రామానికి సమీపంలో ఉన్న కొండ్రావుపల్లికి చెందిన నాగరాజుతో గత సంవత్సరం మే 25న వివాహం జరిపించారు. నాగరాజు తండ్రి స్వామి, తల్లి ఈశ్వరమ్మ, సోదరుడుతో కలిసి మియాపూర్‌లోని ఎంఏనగర్ కాలనీలో నివాసముంటున్నారు. నాగరాజు డ్రైవర్‌గా పనిచేస్తూండగా నాగరాజు తల్లిదండ్రులు సమీప కాలనీలో పూల వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో సోమ వారం ఉదయం నాగరాజు పనిపై బయటికి వెళ్లాడు. 11 గంటలు అవుతున్నా హేమలత బయటికి రాకపోవడంతో అత్త ఈశ్వరమ్మ తలుపు తట్టగా పలక లేదు. దీంతో స్థానికుల సహాయంతో కిటికి నుండి చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని కనిపించింది. స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి కిందికి దింపారు. మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం..

ఏడు నెలల క్రితమే ప్రేమ వివాహం

పటాన్‌చెరు టౌన్: బయటకు వెళ్లి వస్తానని చెప్పిన వ్యక్తి కనిపించకుండాపోయాడు. అమీన్‌పూర్ ఎస్‌ఐ సోమేశ్వరి కథనం ప్రకారం...మెదక్ జిల్లా నర్సపూర్ మండలం హమీద్‌నగర్‌కు చెందిన ప్రణయ్ కుమార్‌రెడ్డి, సాయిలత ప్రేమ వివాహం చేసుకున్నారు. ఏడునెలల క్రితం ఉపాధి నిమిత్తం అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని భవానీపురం కాలనీకి వచ్చారు. ఈ నెల 22వ తేదీ రాత్రి పదిగంటలకు బయటకు వెళుతున్నానని చెప్పాడు. రాత్రయినా తిరిగి రాలేదు. భర్త కోసం భార్య సాయిలత తెలిసినవారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఐదురోజులు దాటినా జాడ తెలియకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేసింది.

అప్పుల బాధతో..

పటాన్‌చెరు టౌన్: అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. భానూర్-బీడీఎల్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం..రామచంద్రాపురం పరిధిలోని ఈదులనాగులపల్లికి చెందిన మల్లేష్(38) పెయింటర్. దుబారా ఖర్చుల కారణంగా అప్పులయ్యాయి. కాగా 26వ తేదీన పనిఉందని చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు అతడి కోసం గాలించారు. గ్రామ శివారులోని తెల్లగుట్ట వద్ద వేపచెట్టుకు మల్లేష్ ఉరేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులతో కలిసి సంఘటనాస్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సింధూజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని..

మియాపూర్: ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నేనావత్ దుర్గ్యా బతుకు దెరువుకోసం రెండు సంవత్సరాల క్రిందట నగరానికి వచ్చి శేరిలింగంపల్లి నల్లగండ్ల సమీపంలో నవోదయ కాలనీలో నివాసముంటూ స్థానికంగా సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం 6.30 సమయంలో నల్లగండ్ల మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి రాత్రి 7 గంటల సమయంలో నల్లగండ్లలోని రాంకీ అపార్ట్‌మెంట్ సమీపంలో రోడ్డు దాటుతుండగా గోపన్‌పల్లి వైపు వెళ్తున్న ఓ ద్విచక్రవాహన దారుడు అతివేగంగా వచ్చి దుర్గ్యా నాయక్‌ను ఢీకొట్టారు. దీంతో కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా సిటిజన్ ఆసుపత్రికి తరలించారు. రాత్రి 1 గంటకు అక్కడ నుండి గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం దుర్గ్యా మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ మేరకు కుమారుడు తిరుపతి చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక



హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని సాయిబాబా గుడి కమ్యూనిటీ హాల్‌లో సోమవారం మియాపూర్ గాయత్రి బ్రాహ్మణ అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, చెక్కిలం సుధాకర్, అధ్యక్షులు ప్రభాకర్‌రావులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది పాల్గొనగా దాదాపు 15 మందికి పైగా సంబంధం కుదిరినట్టు సంఘం సభ్యులు తెలిపారు. ఈ పరిచయ వేదికలో సంఘం సలహాదారులు మంత్రి ప్రగడ సత్యనారాయణ, సంఘం వెస్ట్‌జోన్ ప్రతినిధులు రమేష్, డిసి.రాఘవరావు, మియాపూర్ సంఘం సభ్యులు శంకర్, పిఆర్‌కె మూర్తి, సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాగోస-బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ సమావేశం



సమావేశంలో రవికుమార్ యాదవ్, బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ప్రజాగోస–బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశం శక్తి కేంద్రం ఇన్‌చార్జి పంతంగి బాలు యాదవ్, శ్రీకాంత్ యాదవ్‌ల ఆధ్వర్యంలో హనుమాన్ నగర్‌లో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ హాజరై ప్రభుత్వ తీరుపై విమర్శించారు. అనంతరం ప్రధాన మంత్రి మోడీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పలు పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగుల రాజిరెడ్డి, శ్రీధర్ పటేల్, సాయికుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చందానగర్‌లో..

మియాపూర్: చందానగర్‌లోని శంకర్‌నగర్ కాలనీలో శక్తి కేంద్రాల కార్నర్ సమావేశంను సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ , మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డిలు హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరే విధంగా కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలన్నారు. నాయకులు చందర్‌రావు, పోచయ్య, గౌస్, ఎస్‌ఎస్‌రావు, సంజీవరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల నివాళి

రాయదుర్గం: డాక్టర్ ప్రీతి ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ డిమాండ్ చేసింది. సోమవారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ కార్గిల్ చౌక్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలిపారు. ప్రీతికి న్యా యం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.





కార్పొరేటర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

మౌలిక వసతుల కల్పనకు కృషి

పటాన్‌చెరు టౌన్: తిమ్మక్క చెరువు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మత్స్యశాఖ భవనంలో మౌలిక వసతులు కల్పించాలంటూ మత్స్యశాఖ అసోసియేషన్ సభ్యులు సోమవారం కార్పొరేటర్ మెట్టు కుమార్‌ను కలసి కోరారు. దీంతో ఆయన అధికారులతో కలసి అక్కడకు వెళ్లారు. నూతన భవనానికి డ్రైనేజీ వ్యవస్థ లేనందున వెంటనే డ్రైనేజీ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చైతన్యనగర్ కాలనీలో పర్యటించగా, డ్రైనేజీ లైన్ లేదని కాలనీవాసులు కార్పొరేటర్‌కు వివరించగా, కాలనీలో నూతన డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు.